## తప్పుడు అఫిడవిట్‌పై కేసు నమోదు

కాసిపేట, ఫిబ్రవరి 20 : తప్పుడు అఫిడవిట్ చూపించి పోలీస్ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చూపించి ఎస్ఐ ప్రవీణ్ కుమార్ వివరాలను వెల్లడించారు. కాసిపేట మండలంలోని స్టేషన్ పెద్దనపల్లికి చెందిన కోవెల శ్రావణ్ తనపై ఎలాంటి కేసులు లేవని తప్పుడు అఫిడవిట్‌తో పోలీస్ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. పోలీస్ స్పెషల్ బ్రాంచ్ ఉన్నతాధికారులు దర్యాప్తు చేసి చెక్ బౌన్స్ కేసు ఉన్నాయని గుర్తించారు. తప్పుడు వివరాలు అందించినందుకు అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.

## 5 ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

తాండూర్, ఫిబ్రవరి 20 : అక్రమంగా మట్టి తరలిస్తున్న 5 ట్రాక్టర్లు, ఒ జేసీబీని రెవెన్యూ సిబ్బంది సీజ్ చేసిన ఘటన తాండూర్ మండలం రేచిని గ్రామ శివారులో గురువారం చోటుచేసుకున్నది. గిర్దావార్ ఎండీ ఎజాజొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం వెళ్లి తనిఖీ చేయగా రేచిని గ్రామ శివారులో ప్రభుత్వ చెరువు నుంచి అనుమతి లేకుండా, అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఒక జేసీబీ, 5 ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసి తాండూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అక్రమంగా మట్టి తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### గుండ్ల సోమారంలో 2 ట్రాక్టర్లు సీజ్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 20 : నెన్నెల మండలంలోని గుండ్ల సోమారం గ్రామ శివారులో వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసినట్లు తాళ్ల గురిజాల ఎస్ఐ రమేశ్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు బెల్లంపల్లి మండలంలోని పెరకపల్లిలో డంపు చేసేందుకు తరలిస్తుండగా దుగుట కుమార్, తైదల విశ్వనాథ్‌కు చెందిన ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. వాగులు, ఇతర మార్గాల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెల్లడించారు.

## మహిళ ఆత్మహత్య

తిర్యాణి, ఫిబ్రవరి 20: మండలంలోని గోయగాం గ్రామానికి చెందిన అంకతి రాజక్క(53) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..రాజక్క మనవరాలికి వివాహం కోసం ఈ నెల 14న కొత్త బట్టల కొనుగోలుకు కోసం తన కుటుంబ సభ్యులతో కలిసి మంచిర్యాలకు వెళ్లింది. అదే రోజు రాత్రి 9 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చింది. ఈ సమయంలో ఇంట్లో అన్నం లేకపోవడంతో తన భర్త రాజయ్యతో గొడవ పడింది. ఉదయం రాజక్క పడుకున్న మంచం దగ్గర పురుగులమందు డబ్బా కనిపించింది. గమనించిన కుటుంబ సభ్యులు మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించగా పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎం దవఖానకు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందింది. గతంలో రోడ్డు ప్రమాదంలో రాజక్క తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అప్పటి నుంచి ఆమె మానసిక పరిస్థితి బాగోలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి కోడలు అంకతి అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అప్పల బాధతో ఒకరి ఆత్మహత్య

లక్షెట్టిపేట ఫిబ్రవరి 20 : మండలంలోని హనుమంతుపల్లికి చెందిన నస్పూరి గౌరయ్య(49) గురువారం ఉదయం 5:00 ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ సతీశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..గౌరయ్య ముంబై లో కూలి పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సంవత్సరం క్రితం ముంబై నుంచి వచ్చి కూతురు పెళ్లి చేసి గ్రామంలో ఇల్లు కట్టుకున్నాడు. ఇందుకు రూ.5 లక్షల వరకు అప్పు చేసాడు. అవి తీర్చడం భారమై ఆత్మహత్య చేసుకుని చనిపోయాడని భార్య సత్తవ్వ ఫిర్యాదు చేయగా ఎస్ఐ సతీశ్ కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మార్చి 2న టాలెంట్ టెస్ట్

హాజీపూర్, ఫిబ్రవరి 20 : విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు టాలెంట్ టెస్టులు ఎంతగానో ఉపయోగ పడుతాయని హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ అన్నారు. గురువారం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న టాలెంట్ టెస్టు పోటీల పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి తిరుపతి, కార్యదర్శి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 22న కరాటే పోటీలు

మందమర్రి రూరల్, ఫిబ్రవరి 20: ఈనెల 22, 23 తేదీల్లో మందమర్రి పట్టణంలోని సీఐఎస్ఎఫ్ బ్యారెక్స్ లో జరగనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు విజయవంతం చేయాలని పోటీల నిర్వాహకులు రంగు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

## మాజీ ఎంపీటీసీకి విజిత్‌రావు పరామర్శ



హైమద్‌ను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నేత విజిత్‌రావు

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 20: నస్పూర్ మాజీ ఎంపీటీసీ తండ్రి ఎండీ హైమద్ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావు పరామర్శించారు. ఇటీవల హైమద్ తండ్రి అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం విజిత్‌రావు, ఫ్లడ్‌కాలనీలోని ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని ప్రకటించారు. ఆయన వెంట నాయకులు కాటం రాజు, అడ్లకొండ రవిగౌడ్, బండారి తిరుపతి, తదితరులు ఉన్నారు.

## ఎర్ర చెరువును అభివృద్ధి చేయాలి

మందమర్రి రూరల్, ఫిబ్రవరి 20: మండలంలోని ఆదిల్‌పేట్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్ర చెరువు పూడిక తీసి ఆయకట్టు రైతులకు సాగునీరందిచాలని బహుజన్ సమాజ్ పార్టీ చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ముల్కల రాజేంద్రప్రసాద్ కోరారు. గురువారం మందమర్రి పట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయంలో డివిజినల్ ఇంజినీర్ శారదను కలిసి వినతి పత్రం అందజేశారు. 10 సంవత్సరాల క్రితం చెరువు అభివృద్ధి కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన భూములకు హద్దులు గుర్తించి, వాటికి ట్రెంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. వీరితో పాటు బీఎస్పీ నాయకులు సింగతి రంగనాథ్ పాల్గొన్నారు.

## వీధి కుక్కల బారి నుంచి కాపాడండి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 20: మంచిర్యాల పట్టణంలోని మజీద్‌వాడ, సాయికుంట ప్రాంతాల్లో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉన్నదని వాటి బారి నుంచి ప్రజలను కాపాడాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణతో పాటు కాలనీల వాసులు గురువారం కార్పొరేషన్ కమిషనర్ తౌటం శివాజీకి వినతిపత్రం అందించారు. స్కూళ్లకు వెళ్లే పిల్లలు, పాదచారులు, వాహనదారులను కుక్కలు వెంబడిస్తూ ప్రమాదాలకు గురి చేస్తున్నాయని తెలిపారు. సాయికుంట నుంచి గోదావరి నదికి వెళ్లే దారివెంట ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించాలని కోరారు. దోమల బెడద నివారణకు నివాస ప్రాంతాల వద్ద ఫాగింగ్‌స్ప్రే చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు జావిద్, జుబేర్ అహ్మద్, జాకీర్, చెక్కు, అంజద్ ఖాన్, అతిక్, హైమద్, తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 20: వేసవి కాలంలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అన్ని రకాల ప్రణాళికలను సిద్ధంచేసినట్లు మంచిర్యాల సర్కిల్ ఎస్ఈ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న గరిష్టంగా 3.4 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగించడం జరిగిందని, లోడ్‌పెరిగే ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి కొత్తగా 205 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, 135 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామని, 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో కొత్తగా 5పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు నెలకొల్పామని, 6 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు రెండు ఇంటర్‌లింక్ లైన్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

హాజీపూర్, ఫిబ్రవరి 20 : మండలంలోని ర్యాలీ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మండల ప్రత్యేక అధికారి, డీఆర్డీవో కిషన్ పరిశీలించారు. ఈ పథకంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న పలు రకాల పనులను పరిశీలించి పలు సూచనలు, సలహాలను చేశారు. డీఆర్డీవో వెంట ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తవక్కల్ పాఠశాలలో మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న తవక్కల్ విద్యాసంస్థల అధినేత అబ్దుల్ అజీజ్

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 20: తవక్కల్ విద్యాసంస్థల అధినేత అబ్దుల్ అజీజ్ 57వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని రక్త హీనత, తలసేమియాతో బాధపడుతున్న వారి కోసం రామకృష్ణాపూర్ తవక్కల్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వివిధ పార్టీల నాయకులు, స్నేహితులు, విద్యార్థుల తల్లిదండ్రులలో కలిసి అబ్దుల్ అజీజ్ ప్రారంభించారు. ఈ శిబిరంలో అబ్దుల్ అజీజ్ అభిమానులు, పాత్రికేయులు, హమాలీ సంఘం సభ్యులు, పాఠశాల సిబ్బంది, ట్రస్మా సభ్యులు, పూర్వ విద్యార్థులు, ఆర్కేపీ ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, నాయకులు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. సుమారు 70 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పల్లెరాజు, రఘునాథ్‌రెడ్డి, గాండ్ల సమ్మయ్య, ఎర్రబెల్లి ప్రేమలత రాజేశ్, శివకిరణ్, పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్‌వర్మ, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వేలాల జాతరకు ఏర్పాట్ల పరిశీలన

జైపూర్, ఫిబ్రవరి 20: ఈ నెల 26న జరిగే జాతర ఏర్పాట్లను గురువారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ పరిశీలించారు. మూడు రోజుల పాటు జరిగే జాతరకు వచ్చే భక్తుల కోసం వసతులు కల్పించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. జాతరలో పార్కింగ్ రుసుములో పొనూర్, వేలాల, శివ్వారం గ్రామాల ప్రజలకు మినహాయింపు ఇవ్వాలని ఏసీపీకి విన్నవించారు.

## టీఆర్‌ల నిలిపివేత

తాండూర్, ఫిబ్రవరి 20 : వ్యవసాయ మార్కెట్ కమిటీ బెల్లంపల్లి పరిధి తాండూర్ మండలంలోని రెండు జిన్నింగు మిల్లుల్లో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలుకు ఈ నెల 21వ తేదీ నుంచి నూతనంగా టీఆర్‌లు చేయడం లేదని (ఎఫ్ఏక్యూ) నాణ్యతా ప్రమాణాలకు లోబడి కొనుగోలు చేస్తామని బెల్లంపల్లి మార్కెట్ కమిటీ కార్యదర్శి సిద్ధం భాస్కర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి తమ పత్తిని అమ్ముకోవాల్సిందిగా కోరారు. రైతు తప్పకుండా రావాలని (వేలిముద్ర ద్వారా) ద్వారా పత్తి కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.

## ఆలోచించి పట్టభద్రులు ఓటు వేయాలి

తాండూర్, ఫిబ్రవరి 20: కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తెలంగాణ ఉద్యమకారుడు సర్దార్ రవీందర్‌సింగ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించుకోవాలని బీఆర్ఎస్వీ తాండూర్ మండల అధ్యక్షుడు దొంగ్రీ శ్రీకాంత్ ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, న్యాయవాది, విద్యార్థి నాయకుడు ప్రజాసేవలో నిమగ్నమై ఉండే రవీందర్‌సింగ్‌కు మండలిలో అవకాశం ఇస్తే ప్రశ్నించే గొంతుకై గళమెత్తి పట్టభద్రుల హక్కుల కోసం పోరాడుతాడని తెలిపారు. పట్టభద్రులు ఆలోచించి వేయాలని కోరారు.

## 23న టీజీ సెట్ ప్రవేశ పరీక్ష

బెల్లంపల్లి, ఫిబ్రవరి 20 : 5 తరగతి నుంచి 9వ తరగతి వరకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి నిర్వహించు అర్హత పరీక్ష ఈ నెల 23 ఆదివారం నిర్వహించనున్నట్లు సీఈవో ప్రిన్సిపాల్ దూట శ్రీధర్ తెలిపారు.

# సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటుకు చర్యలు

- కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ
- ఇందాని గ్రామంలో స్థల పరిశీలన



గురుకుల పాఠశాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న దీపక్ తివారీ

వాంకిడి, ఫిబ్రవరి 20 : విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చేపట్టిన సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. గురువారం వాంకిడి మండలం ఇందాని గ్రామంలో సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటుకు ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, వాంకిడి తహసీల్దార్ రియాజ్ అలీతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ (సమీకృత గురుకుల పాఠశాల) ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో సమీకృత గురుకుల పాఠశాలకుస్థలాన్ని గుర్తించేందుకు పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 20:జిల్లాలో ప్రధానమంత్రి శ్రీ పథకం కింద ఎంపికైన ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఇన్చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి గమ్మని యల్ తో కలిసి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ లతో పాఠశాలలలో చేపట్టే కార్యకలాపాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నిర్మాణ పనులు, ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు ఆబిద్ అలీ, మధుకర్, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగించుకోండి

- ఆసిఫాబాద్ జిల్లా జడ్జి ఎంవీ రమేశ్



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి ఎంవీ రమేశ్

ఆసిఫాబాద్ టౌన్,ఫిబ్రవరి20:లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారంతో కక్షిదారులకు అదనపు లాభాలు కలుగుతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి ఎంవీ రమేశ్ అన్నారు. మార్చి 8వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ను పురస్కరించుకొని జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు అడ్వకేట్లతో సీనియర్ సివిల్ జడ్జీ యువరాజ్, జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మితో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. మార్చి 8న 5000 కేసుల పరిష్కారమే లక్ష్యంగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ లీగల్ సర్వీస్ అథారిటీ టోల్ ఫ్రీ నంబర్ 15100 కు కూడా ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ నెల 24న ముందస్తు లోక్ అదాలత్ లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్చి 8 వరకు కేసుల పరిష్కరించనున్నట్లు తెలిపారు. .

## దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తాం

- డీడబ్ల్యూఓ రాఫ్ ఖాన్



మాట్లాడుతున్న అధికారులు

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 20 : జిల్లా సహకార సంస్థ, ఆలింకో సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో త్వరలోనే దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తామని డీడబ్ల్యూవో రౌఫ్ ఖాన్ అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ యార్డ్‌లోని రైతు వేదికలో నిర్వహించిన క్యాంపు లో మాట్లాడారు. సీడీపీవో ప్రాజెక్టు పరిధిలోని లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాలకు చెందిన అర్హులైన దివ్యాంగులకు ఉపకరణాలు, సహాయక పరికరాల కోసం 440 పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో మందా రేష్మ, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, సూపర్వైజర్లు, వివిధ మండలాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 20: దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జాతీయ ఆరోగ్య మిషన్ పీఆర్సీ బృందం సభ్యులు రమణ, శ్రీనివాస్. గురువారం వంద పడకల దవాఖానను ఆ బృందం సభ్యులు సందర్శించారు. వైద్యం అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు వైద్యులు, సిబ్బందికి పలు సలహాలు సూచనలు చేశారు. దవాఖానలో వంద శాతం ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ కోటేశ్వర్ రావు, మెడికల్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, డీపీవో ప్రశాంతి, ల్యాబ్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

హాజీపూర్/కన్నెపల్లి ఫిబ్రవరి 20 : హాజీపూర్ మండలంలోని ముత్యంపేట వద్ద గురువారం తెల్లవారు జామున రెండు గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమిని మండలం వీగాంకు చెందిన కర్రె రాజక్క (62) మృతి చెందినట్లు హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులు, ఎస్ఐ, తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని మండలంలోని వీగాం గ్రామంలో రాజక్క మేనల్లుడు బైరి భీరేశ్‌కు పెద్దపల్లి జిల్లా జూలపల్లికి చెందిన యువతితో గురువారం ఉదయం 11 గంటలకు వివాహం జరగాల్సి ఉంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి పెళ్లి కూతురును కారులో తీసుకువస్తుండగా హాజీపూర్ మండలంలో ముత్యంపేట వద్ద మంచిర్యాల వైపు నుంచి లక్షెట్టిపేట వైపునకు వెళ్తున్న లారీ మంచిర్యాల వైపునకు వస్తున్న కారును అతి వేగంగా ఢీ కొట్టిందన్నారు. దీంతో కారులో ఉన్న కర్రె రాజక్కకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. మిగతా వారికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా కాలిపోయినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారన్నారు. కుమారుడు కర్రె రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రాజక్క మృతితో పచ్చని పందిళ్లు, మేళ తాళాలతో పెళ్లి జరగాల్సిన ఆ ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## 22న ఇసుక వేలం పాట

రెబ్బెన, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా గనులు, తవ్వకాల శాఖ ఆధ్వర్యంలో పట్టుకున్న ఇసుకను 22న శనివారం ఉదయం 11గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్‌రావు తెలిపారు.

## చెరువు పూడిక తీయించాలి

- మందమర్రి ఏరియా జీఎంకు రైతులు, మత్స్యకారుల వినతి



వినతి పత్రం అందజేస్తున్న రైతులు, మత్స్యకారులు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 20 : రామకృష్ణాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు, రైతులు అమరవాది చెరువులో పూడికను తీయించాలని కోరుతూ మందమర్రి ఏరియా జీఎం దేవేందర్‌రెడ్డికు గురువారం వినతి పత్రం అందజేసి కోరారు. ఈ సందర్భంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు నూనె శ్రీనివాస్ మాట్లాడుతూ సుమారు 12 సంవత్సరాల క్రితం రామకృష్ణాపూర్ ఉపరితల గని ఏర్పాటు నుంచి అమరవాది చెరువు ఆనుకొని ఓబీ డంప్ గుట్టగా పోయడంతో వర్షాకాలం ఓబీ పై నుంచి వర్షంతో పాటు ఒండ్రుమట్టి జారివచ్చి చెరువులో చేరుతున్నదన్నారు. దీంతో సుమారు 15 ఎకరాల్లో పూడిక పేరుకపోయిందని తెలిపారు. పూడిక తీయిస్తే చేపల పెంపకానికి అనువుగా మారి మత్స్యకారులు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. త్వరలోనే చెరువు పూడిక తీయిస్తానని జీఎం దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు నూనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రవీంద్రబాబు, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, సభ్యుడు పెద్దపల్లి ఉప్పలయ్య, గ్రామ రైతులు గట్టయ్య, కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## షాట్‌పుట్ లో సంపత్‌కు పతకం

బెల్లంపల్లి ఫిబ్రవరి 20: ఈ నెల 18 నుంచి 19 వరకు వరకు ఉస్మానియా యూనివర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యూత్ అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో కోటపల్లి మండలం నాగంపేటకు చెందిన ఈర్ల సంపత్ రాష్ట్రస్థాయిలో పురుషుల విభాగంలో కాంస్య పతకం సాధించాడని కోచ్ సంతోష్ తెలిపారు. కోచ్ సంతోష్ ను, అథ్లెట్ సంపత్ ను మంచిర్యాల జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి ఈ. మారయ్య అభినందించారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్లు



మంచిర్యాల జిల్లా బాలికల జట్టు క్రీడాకారులతో కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 20: ఈ నెల 20 నుంచి 23 వరకు వికారాబాద్‌లో నిర్వహించే 34వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మంచిర్యాల జిల్లా బాలబాలికల జట్లు గురువారం తెల్లవారుజామున నస్పూర్ నుంచి వికారాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. మంచిర్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న నస్పూర్ నాగార్జునకాలనీ సింగరేణి ప్రాణహిత స్టేడియంలో జిల్లా జట్లను ఎంపిక చేసి వారం రోజుల పాటు వీరికి ఇక్కడే శిక్షణ ఇచ్చారు. కోచ్‌గా ఆకాంక్ష వ్యవహరించనుందని తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు కొండ్ర కార్తీక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచందర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

## విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

- ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా



రాంజీగూడలో విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

కెరమెరి, ఫిబ్రవరి 20: ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం కెరమెరి మండలంలోని రాంజీగూడ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లీష్ ప్రోగ్రాంను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందించాలన్నారు. విద్యార్థులు సురక్షితమైన నీటిని తాగాలని, బోర్ వెల్ నీరు తాగడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రేందాస్, సిబ్బంది, విద్యార్థులున్నారు.

## ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు



చెడువాయిలో స్థల రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

పెంచికల్ పేట్, ఫిబ్రవరి 20 ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాగజ్‌గర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు.గురువారం మండలంలోని చెడువాయి గ్రామంలో పర్యటించారు. కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను కబ్జా చేశారని తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల స్థలాలు రికార్డులను పరిశీలించి తగు సూచనలను అందించారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు ఆర్ఐ సురేశ్ నాయకులు శ్రీనివాస్, బండు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించాలి

కౌటాల, ఫిబ్రవరి 20 : మండలంలోని ప్రయివేటు విద్యా సంస్థలు యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. గురువారం ఎంఆర్సీ భవనంలో ప్రయివేటు యాజమాన్యాల హెచ్ఎంలతో సమావేశం ఏర్పాటు చేసారు. ప్రయివేటు పాఠశాలల్లో నిబంధనలు పాటించాలని, ప్రతి విద్యార్థి ఆధార్ నంబర్, అపార్‌లను యు డైస్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో కౌటాల, గుండాయిపేట కాంప్లెక్స్ హెచ్ఎంలు నారాయణ సింగ్, నానాజీలతో పాటు సీఆర్పీలు

## మెనూ ప్రకారం భోజనం అందించాలి



మాట్లాడుతున్న డీసీపీవో బూర్ల మహేశ్

వాంకిడి, ఫిబ్రవరి 20: పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలని డీసీపీవో బూర్ల మహేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. భోజనాన్ని పరిశీలించారు. వార్షిక పరీక్షలపై పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్ర శేఖర్, చైల్డ్ హెల్ప్ లైన్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ బల ప్రవీణ్ కుమార్, కేస్ వర్కర్ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాడు గుల నారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

## పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

వాంకిడి, ఫిబ్రవరి 20 : జీపీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేలా చూడాలని కోరుతూ మండల పరిషత్ అధికారికి పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పీ.పోషం తెలిపారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంచాయతీలకు నిధులు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. వాంకిడి మండలంలోని కార్యదర్శులకు, గ్రామపంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లింపు, పంచాయతీల నిర్వహణ తమకు భారంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

## అవగాహనతో క్షయ వ్యాధి దూరం

వాంకిడి, ఫిబ్రవరి 20 :క్షయ వ్యాధి (టీబీ)పై సంపూర్ణ అవగాహన ఉంటేనే రక్షణ పొందవచ్చునని, వాంకిడి మండల ఆరోగ్య విస్తర అధికారి రవిదాస్ అన్నారు. గురువారం మండలంలోని జైత్‌పూర్, బోర్డ గ్రామాలోని పాఠశాలల విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. మూడు వారాలకు మించి దగ్గు, రాత్రి పూట జ్వరం, బరువు తగ్గడం, లక్షణాలు ఉంటే మండల కేంద్రంలోని (పీహెచ్‌సీ) ప్రభుత్వ దవాఖానలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భగవాన్ దాస్, పంచాయతీ కార్యదర్శి శరణ్య, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పట్టుదలతో చదివితే విజయం తథ్యం

తిర్యాణి,ఫిబ్రవరి 20: విద్యార్థులు పట్టుదలతో చదివితే విజయం సాధ్యమని ఎంఈవో అంజయ్య సూచించారు. మండలకేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో గురువారం టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మోటివేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. పరీక్షలపై ఒత్తిడిని అధిగమించడం, ప్రణాళికతో సన్నద్ధమవడం, గణిత శాస్త్రంలో పాటించాల్సిన మెలకువలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శంకర్,కృష్ణారావు, షేకు, టీయూటీఎఫ్ నాయకులు కోట్నాక ప్రవీణ్ కుమార్, గెడం జనార్దన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు తీసుకురావాలి

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 20: పదవతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ సర్పంచ్ సెండే దత్తు అన్నారు. గురువారం వార్షిక పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను అందజేశారు. గుండి గ్రామం లోని పాఠశాల పదవ తరగతి అప్ గ్రేడ్ అయిందని మొదటి బ్యాచ్‌లో విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తీరుసుల్ల సత్తన్న, గుండి యువజన సేవా సమితి అధ్యక్షుడు బొమ్మకంటి కిరణ్, వెంకన్న పాల్గొన్నారు.

## బాలాజీ ఆలయంలో చోరీ



హుండీని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

రెబ్బెన, ఫిబ్రవరి 20: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామ శివారులో బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి దొంగతనం జరిగినట్లు రెబ్బెన సీఐ బుద్దే స్వామి, ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం..గంగాపూర్ బాలాజీ ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి గేటు తాళం పగలగొట్టి ఆలయంలో చొరబడి హుండీ తాళం పగలగొట్టి హుండీ లో ఉన్న నగదు తీసుకవెళ్లినట్లు తెలిపారు. ఇటీవల జాతర ఆదాయం లెక్కించడంతో హుండీలో ఎక్కువ మొత్తం డబ్బులు లేవని తెలిపారు. క్లూస్ టీం. ఫింగర్ ప్రింట్ టీం లు వచ్చి ఆధారాలు సేకరించినట్లు పేర్కొన్నారు. ఆలయ ఈవో బాపురెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాల పుటేజ్ అధారంగా దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.